అంతర్జాతీయ ఈత పోటీలకు ఎంపికైన ప్రేమ్‌కుమార్

ప్రేమ్‌కుమార్‌ను అభినందించిన ఎమ్మెల్యే రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలోని జమ్ము గ్రామానికి చెందిన టెంక ప్రేమ్‌కుమార్‌కు నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి సోమవారం రాత్రి అభినందించారు. అంతర్జాతీయ ఈత పోటీలు త్వరలో జరిగే ఈజిప్టు దేశానికి ప్రేమ్‌కుమార్ ఎంపికైనాడు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ క్రీడా రంగానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా వుంటుందని, అంతర్జాతీయ ఈత పోటీలకు ఎంపికైన ప్రేమ్‌కుమార్‌కు సహకారం అందిస్తామని తెలిపారు. ఈజిప్టులో జరిగే ఈత పోటీల్లో ప్రేమ్‌కుమార్ విజేతగా నిలవాలని అన్నారు. ఈ సంధర్భంగా ప్రేమ్‌కుమార్‌కు, ఆయన తల్లితండ్రులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, డా.మెండ ప్రవీణ్‌కుమార్, టి.ఎన్.ఎస్.ఎఫ్ అధ్యక్షులు, బలగ ప్రహర్ష, పాల్గొన్నారు.

23న పోరాట యోధురాలు కామ్రేడ్ పైలా చంద్రమ్మ వర్ధంతి

విశాలాంధ్ర-మందస: సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ,మహోత్తర శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటంలో అవిశ్రాం తంగా పోరాడిన కామ్రేడ్ పైలా చంద్రమ్మ నాలుగవ వర్ధంతి సభ ఈ నెల 23 ఉదయం10 గంటలకు మండలం రట్టి గ్రామంలో నిర్వహిస్తున్నట్లుగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు తెలిపారు. మంగళవారం రట్టిలో కామ్రేడ్ చంద్రమ్మ సభ వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడిత తాడిత రైతాంగం కోసం బలహీన వర్గాల ప్రజల కోసం తీర ప్రాంతంలో మత్స్యకారులు ఆదివాసీలు దళితులు రైతు కూలీల హక్కుల కోసం ఆరు దశాబ్దాలు అవిరామంగా చంద్రమ్మ పోరాడారని అట్లాంటి విప్లవ వీర వనిత జీవిత చరిత్రను మనం స్మరించుకొని రైతు కూలీ ఉద్యమాలు నిర్మించాలని మాధవరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, భారత కార్మిక సంఘాల సమైక్య(ఐఎఫ్టియు) జిల్లా కన్వీనర్ వీరాస్వామి, పిన్నింటి.దాలయ్య, మామిడి మహాలక్ష్మి, లండ.వల్లభ రావు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవాలో ఎమ్మెల్యే రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక మేజర్ పంచాయితీ కార్యాలయలో మంగళవారం నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే, రమణమూర్తికి మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, ఈవో, పి.ద్రాక్షాయిణి పుష్పగుచ్ఛమందించి, శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే, రమణమూర్తి, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అలాగే పంచాయితీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా వుంటేనే మానవాళి ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని తెలిపారు. ఈ సంధర్భంగా పంచాయితీ కార్యాలయం నుండి కళాశాల జంక్షన్ వరకూ స్వచ్ఛత ర్యాలీలో విధ్యార్ధులు, అధికారులుతో పాల్గొని, గాంధీ ఆశయాలను కొనసాగిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహాశీల్ధార్, టి.సత్యన్నారాయణ, ఎంపిడివో, బి.మధుసూధనరావు, టిడిపి ప్రతినిధులు, వూణ్ణ రాజశ్రీ వేంకటేశ్వరరావు, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, బోయిన సతీష్, గొలివి రామారావు, పీస కృష్ణ, జామి వెంకటరావు, దంత త్రినాధరావు, షేక్‌మదీనా, బతకల గోపి, వారణాశి రమేష్, పుచ్చల కల్పన పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ అందరి బాధ్యత కావాలి

ఎమ్మెల్యే గొండు శంకర్



విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: స్వచ్ఛతా హీ సేవ అందరి బాధ్యత కావాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. సింగుపురం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు అని ఆయన అడుగుజాడలలో భారతదేశం అభివృద్ధి చెందుతుందని అభివృద్ధితో పాటు పరిశుభ్రత పై అవగాహన పెంపొందించుకోవాలని 10 సంవత్సరాల క్రితం భారతదేశాన్ని స్వచ్ఛత వైపు తీసుకువెళ్లాలని మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకొని స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. దేశమంతా పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో 14 రోజులపాటు స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమములో భాగస్వామ్యం కావాలని, స్వచ్ఛ శ్రీకాకుళం జిల్లాగా స్వచ్ఛ గ్రామాలు, వార్డులుగా రూపుదిద్దుటకు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఆర్. వెంకట్రామన్, సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు, ఈవోపీఆర్డీ వి. ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి ఎ. రమేష్, ఎపీఎం. వి. సుజాత, ఏవో ఎం. ఉషా కుమారి, టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఏడి జె ఎస్ నాగలక్ష్మి జ్యోతి

విశాలాంధ్ర-జలుమూరు: జలుమూరు మండల ప్రత్యేక అధికారిగా శ్రీకాకుళం మార్కెట్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేస్తున్న జెఎస్ నాగలక్ష్మి జ్యోతి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు మండలంలో పంచాయతీలు ఎంపీటీసీలు ఇతర అంశాలపై ఎంపీడీవోతో చర్చించారు. ప్రభుత్వం నియమించిన మేము, మా బాధ్యతను సంయుక్తంగా నిర్వహిస్తామని అన్నారు.

మత్స్యకార కుటుంబానికి చెక్కు అందజేత

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలంలోని బొంతల కోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం గ్రామానికి చెందిన చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు కొమర జంగమయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళ వారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు రూ.5 లక్షల చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సింహాచలం, జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, మండల టీడీపీ అధ్యకుడు బెందు మల్లేశ్వరరావు, బొంతలకోడూరు మాజీ సర్పంచ్ మాడుగుల వీరభద్రస్వామి, లావేటి అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించాలి

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

- ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: మన భారతదేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించాలని అందుకు శ్రీకాకుళం నుండే శ్రీకారం చుట్టాలన్నారు. "స్వచ్ఛ భారత్ దివస్" కార్యక్రమంలో స్వభావ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత అను నినాదంతో నిర్వహించడం జరుగుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ తో కలసి జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఈరోజు మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు అని ఆయన అడుగుజాడలలో భారతదేశం అభివృద్ధి చెందుతుందని అభివృద్ధితోపాటు పరిశుభ్రత పై అవగాహన పెంపొందించుకోవాలని 10 సంవత్సరాల క్రితం భారతదేశాన్ని స్వచ్ఛత వైపు తీసుకువెళ్లాలని మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకొని స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. దేశమంతా పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో 14 రోజులపాటు స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ 14 రోజులు పాటు మనం చేపట్టే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. దేశంలోనే భారతదేశం అగ్రస్థానం సాధించాలని అందుకు శ్రీకాకుళం నుండి శ్రీకారం చుట్టాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం "స్వచ్ఛతా హీ సేవ" కార్యక్రమము 14 సెప్టెంబర్ నుండి 01 అక్టోబర్ వరకు "స్వభావ్ స్వచ్ఛతా-సంస్కార్ స్వచ్ఛత" అను ఇతివృత్తము ద్వారా నిర్వహించుకొనుచున్నామన్నారు. స్వచ్ఛత పట్ల మన స్వభవంలోనూ, సంస్కారం లోనూ మార్పు రావాలన్నారు. కావున ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార సంస్థలు కార్యక్రమములో భాగస్వామ్యం కావాలని, స్వచ్ఛ శ్రీకాకుళం జిల్లాగా స్వచ్ఛ గ్రామాలు, వార్డులుగా రూపుదిద్దుటకు సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని అందరి సహకారంతోనే అది సుసాధ్యమని ఇటువంటి కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార సంస్థలు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరితో ముఖ్య అతిథులు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ దుస్తులు అందజేశారు. అక్కడ నుండి బయలుదేరి హెచ్ బి కాలనీ వెనుక వైపు పార్కులో స్వచ్ఛతా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. బి. మీనాక్షి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె చెన్నకేశవరావు, మున్సిపల్ కార్యాలయ అధికారులు సిబ్బంది. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగస్తులు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరూ నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేసుకోవాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: పిల్లలందరూ నులి పురుగులు నిర్మూలనకు మాత్రలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. మంగళ వారం పి.ఎస్.ఎన్. యమ్ .హెచ్.స్కూల్ లో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, శ్రీకాకుళం శాసనసభ్యులతో కలసి విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాతూ 2-19 సంవత్సరాల వయసు లోపల ఉన్న విద్యార్థులందరు ఒక ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని చెప్పారు. ఈ మాత్రలు వలన ఏ విధమైన ఇబ్బందులు ఉండవని, ఏ విధమైన ఇబ్బందులు తలెత్తినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎవరైనా స్కూల్ కి రాకపోతే వారికి మాత్రలు పంపిణీ చేయాలని విద్యార్థులకు తెలిపారు. జిల్లాలో 4 లక్షల 70 వేల మంది పిల్లలు ఉన్నట్టు చెప్పారు. పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలలు ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోకుండా ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని, నులిపురుగుల వలన రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటివి ఉంటాయని చెప్పారు. రాబోయే రోజుల్లో ఎండలు అధికంగా ఉంటాయని అందరు తరచూ మంచినీరు త్రాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య, శాఖాధికారిణి డాక్టర్ మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, జిల్లా కోర్డినేటర్ డాక్టర్ వెంకట్, డి.పి.ఎం.ఓ.జి వి.లక్ష్మీ, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వరులు, ప్రోగ్రాం మేనేజర్ దోమ అప్పలనాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో ఉద్దాన రైతాంగం వ(ఉ)నికి పోయింది

కలక్టర్ కు ఉద్దానం సమస్యలపై వినతి అందజేసిన ఎంఎల్‌సి నర్తు

విశాలాంధ్ర-కవిటి: వరస ప్రకృతి వైపరీత్యాలతో వ(ఉ)నికిపోయి అధ్వాన స్థితిలో ఉన్న ఉద్దాన రైతాంగానికి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎం ఎల్ సి నర్తు రామారావు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను మంగళ వారం కలెక్టర్ కార్యాలయంలో కలసి వినతి అందజేశారు. ఉద్దానం కొబ్బరి ని గానో డెర్మా అనే శిలీంద్రము చంపిస్తోందనీ ఈ తెగుళ్లను ఎదుర్కొనే ట్రైకోడెర్మా శిలీంద్రం మన ప్రాంతంలో అందుబాటులో లేదనీ దీనిని తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట ప్రాంతం నుంచి తెప్పించుకోవలసిన అవసరం ఉందనీ తెలియజేశారు.వందలాది హెక్టార్లలో వ్యాపించి ఉన్న గానో డెర్మా తెగుళ్ల నుంచి ఉద్దాన ప్రాంతాన్ని కాపాడాలని కోరారు.ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్రవాయుగుండం కారణంగా సోంపేట, కవిటి, ఇచ్చాపురం మండలాలలో వందలాది ఎకరాల వరి ముంపునకు గురైందనీ ఉద్దానంలోని బీల ప్రాంతంలో వరి దుబ్బులు కుళ్లిపోయాయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి సహాయాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. కవిటి మండల కేంద్రంలో బెంతొరియా సామాజిక వర్గానికి చెందిన వాళ్లు 262 రోజులుగా రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నారనీ 20 సంవత్సరాలుగా కుల ధ్రువీకరణ పత్రాల కోసం పోరాటం చేస్తున్నారనీ వారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ రహదారులన్నీ ఛిద్రం అయ్యాయి కావున కంచిలి ప్రధాన రహ దారిని ఆటో యూని యన్ సభ్యులు మర మ్మతులు చేసుకోవడం దీనికి తార్కాణం, రహదారుల మరమ్మతు ల కోసం సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేసి, నిర్మాణాలను, మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఇసుక అందుబాటులో లేదనీ ప్రస్తుత స్టాక్ పాయింట్ల నుంచి రవాణా చార్జీలు భారం అవుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో కంటే,ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక పాలసీలో టన్నుకు దాదాపు 8 వందల రూపాయలు అధికం ఖర్చు అవుతుందని తెలిపారు. దీనికి పరిష్కారంగా,ప్రజా ప్రయోజనార్థం కంచిలి ప్రాంతంలో నూతనంగా ఇసుక స్టాక్ పాయింట్ ను ఏర్పాటు చేసే దిశగా పరిశీలన చేయాలని కోరారు.

అధికారుల నిర్వాకంతో ఆశ్రమ పాఠశాల ఖాళీ...

డీజీపురం ఒరియా ఆశ్రమ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుల నియామకం

పాఠాలు అర్థంకాక బడి నుంచి ఇళ్లకు వెళ్లిపోయిన విద్యార్థులు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట మండలం మారుమూల గిరిజన గ్రామమైన ఎంజీపురంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాల అధికారుల నిర్వాకంతో ఖాళీ అయిపోయింది. 206 మంది విద్యార్థులకు గాను మంగళవారం నాటికి కేవలం 25 మంది మాత్రమే విద్యార్థులు మిగిలారంటే పరిస్థితి అంచనా వేయవచ్చు. ఒక్కసారిగా విద్యార్థులు పాఠశాల ఖాళీ చేసి తమ నిరసన తెలియజేయడం వెనుక కొద్ది కాలం క్రితం సంబంధిత అధికారులు ఇక్కడ ప్యూర్ ఒడియా మీడియం పాఠశాలకు నలుగురు తెలుగు మీడియం ఉపాధ్యాయులను నియమించడం వారు బోధించే తెలుగు మీడియం బోధన విద్యార్థులకు అర్థం కాకపోవడం అసలు సమస్యగా చెప్పవచ్చు. ఈ సమస్యపై గత రెండు నెలలుగా విద్యార్థులు పాఠాలు అర్థం కాక అనేక ఇబ్బందులకు గురౌతున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్కండేయులు ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ అపోటా నేతృత్వంలో సంబంధిత జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందించడం కూడా జరిగినప్పటికీ ఉన్నతాధికారులు సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో విసుగెత్తిన విద్యార్థుల్లో దాదాపు 200 మంది పాఠశాల ఖాళీ చేసి తమ స్వగ్రామాలకు వెళ్లిపోవడం గమనార్హం. ముఖ్యంగా ఈ గిరిజనాశ్రమ పాఠశాలలో 3వ తరగతి నుంచి పదవ తరగతివరకు 206 మంది విద్యార్థులు చదువుకుం టున్నారు. సుమారు 30ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ పాఠశాలలో ఇప్పటి వరకు తెలుగు మీడియం ఉపాధ్యాయులను ఎన్నడూ నియమించలేదు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో మొట్టమొదటిసారిగా ఒరియా మీడియం గిరిజన ఆశ్రమ పాఠశాలకు నలుగురు తెలుగు ఉపాధ్యా యులను నియమించడంతో పరిస్థితులు తారుమార య్యాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పలుమార్లు పాఠశాలకు వచ్చి ఉపాధ్యా యులతో వాగ్వివాదానికి దిగడం కూడా జరిగింది. రెండు నెలలుగా ఆందోళన చెందుతున్న విద్యార్థులు గత్యంతరం లేక పాఠశాల వదిలి ఇళ్లకు వెళ్లిపోవడంతో ఒక్కసారిగా ప్రభుత్వ యంత్రాంగం కళ్లు తెరిచింది. పరిస్థితిని గమనించిన అధికారులు మంగళవారం మందస మండలం చిన్నకోస్ట ఆశ్రమ పాఠశాల నుంచి సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు, ఒక ఎస్‌జిటిని డెప్యూటేషన్‌పై ఇక్కడ నియమించారు. అలాగే బయాలజీ సబ్జెక్ట్ బోధనకు ఒక వలంటీర్‌ను కూడా నియమించారు. దీనిపై పలు వర్గాల నుంచి అధికారుల తీరు పట్ల హర్షం వ్యక్తమవుతుంది. స్థానిక సర్పంచ్ హరీష్‌కుమార్ మాట్లాడుతూ ప్యూర్ ఒడియా మీడియం ఆశ్రమ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులను నియమించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడు తున్నారన్నారు. పరిస్థితి వెంటనే మారకపోతే పాఠశాల వద్ద పంచాయతీ ప్రజలతో నిరసనకు దిగుతామని హెచ్చరించారు. అపోటా అధ్యక్షుడు భాస్కర్‌పాడి మాట్లాడుతూ ఒడియా మీడియం పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులను నియమించి గందరగోళానికి తెర తీయడం దురదృష్టకరమని అన్నారు. వెంటనే దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల హెచ్‌ఎం మార్కండేయులు మాట్లాడుతూ ఎట్టకేలకు ఇద్దరు ఉపాధ్యాయులను, ఒక వలంటీర్‌ను నియమించడం జరిగిందని అన్నారు.బుధవారం నుంచివిద్యార్థులను పాఠశాలకు రప్పించి ఎప్పటి మాదిరిగా నిరాటంకంగా తరగతులు కొనసాగిస్తామని అన్నారు.



విద్యార్థులు లేక వెలవెలబోతున్న ఎంజీపురం ఆశ్రమ పాఠశాల

మహోన్నత వ్యక్తి పెరియార్ రామస్వామి...

ఏపిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: దేశంలో బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి పెరియార్ రామస్వామి నాయకర్ అని ఏపిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. రామస్వామి నాయకర్ 145వ జయంతి సందర్భంగా కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని జ్యోతీరావ్‌పూలే పార్క్ లో ఏర్పాటు చేసిన పెరియార్ రామస్వామి నాయకర్ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ దేశంలో దక్షిణాది రాష్ట్రాల ప్రజల హక్కులు కోసం, అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన నేత పెరియార్ అన్నారు. స్త్రీల హక్కులు కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 102 ఎలక్ట్ గవర్నర్, కొంక్యాన ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్ మాట్లాడుతూ దేశ జనాభాలో 85 శాతం బిసి, ఎస్సి, ఎస్టి మైనార్టీలే ఉన్నారని, వీరందరి హక్కులు కోసం బ్రిటిష్ ఇండియాలో పోరాడిన తొలితరం నాయకుల్లో పెరియార్ రామస్వామినాయకర్ ఉంటారని, అటువంటి మహనీయుడి విగ్రహాన్ని తన తండ్రి ట్రస్టు తరపున ఏర్పాటు చేసేందుకు అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి పార్క్ కోశాధికారి గుత్తు చిన్నారావు, బిసి పార్క్ అధ్యక్షుడు ఎం.ఏ. బేగ్ లు మాట్లాడుతూ కొంక్యాన ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్క్ సభ్యులు అదపాక రాంబాబు, కొంక్యాన ట్రస్టు సభ్యులు కొంక్యాన శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ లో డ్రైవర్స్ దినోత్సవ వేడుకలు

- నిత్యావసర సరుకులు వితరణ - విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళం బలగమెట్టు దారిలోగల అమ్మ ఫౌండేషన్ లో డ్రైవర్స్ దినోత్సవ వేడుకలు శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ రాద గణపతి మాట్లాడుతూ ఈ రోజు డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక అమ్మ ఫౌండేషన్ ప్రాంగణంలో శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు నిత్యవసర సరుకులు, పుస్తకాలు, పళ్ళు, కూరగాయలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని, సమాజానికి ఏదో ఒక రూపంలో సేవ చెయ్యాలనే ముఖ్య ఉద్దేశ్యంతో శ్రీకాకుళం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల సూచనలమేరకు డ్రైవర్ల దినోత్సవాన్ని అమ్మ ఫౌండేషన్ లో జరుపుకున్నామన్నారు. డ్రైవర్లు నిరంతర శ్రామికులని, అందరికీ సేవ చేసే భాగ్యం మాకు దక్కినందుకు గర్వంగా ఉందని, భారతదేశంలోని ట్రక్ డ్రైవర్ల సహకారాన్ని గుర్తించే ప్రచారంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న డ్రైవర్స్ డే జరుపుకుంటారని, డ్రైవర్ల కృషిని గుర్తించడం, దేశ నిర్మాణంలో డ్రైవర్ల పాత్రను పురస్కరించుకోవడం, డ్రైవర్ల స్ఫూర్తిని ప్రోత్సహించడం, సమాజానికి డ్రైవర్ల సహకారాన్ని గుర్తించడం వంటి కార్యక్రమాలు నేడు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పర్ల రాము, ప్రధాన కార్యదర్శి పమ్మిన నరేష్, ఎస్పి శ్రీను, కిల్లి రాము, బోనెల శంకర్రావు, నాగరాజు మురళి, తదితర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైలు నుండి జారిపడ్డ వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-టెక్కలి: కోటబొమ్మాళి మండలం లక్కిందిడ్డి గ్రామ సమీప పొదల్లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ట్రైన్ నుండి రాత్రి సమయంలో జారి పడిపోవడం తో తలకు గాయమయ్యి, శరీరం అంతా చీమలు పట్టివున్నాడని, వేకువ జామున అటువైపు వెళ్లిన గ్రామస్తులు టెక్కలి 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వెంటనే స్పందించిన 108 సిబ్బంది దేవాది శ్రీనివాస రావు, మెట్ట సతీష్ లు గ్రామస్థుల సహకారం తో సుమారు అరకిలోమీటర్ ట్రాక్ పై మోసుకుంటూ 108 వాహనంలో ఎక్కించి ప్రథమ చికిత్స చేస్తూ కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పినట్లు 108 ఈయంటి దేవాది శ్రీనివాసరావు తెలియజేసారు. ప్రస్తుతం పేషంట్ అచేతనం గా వున్నాడని తెలియజేసారు. సమాచార ఇచ్చిన వెంటనే త్వరగా స్పందించిన 108 సిబ్బంది ని గ్రామస్తులు అభినందించారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి : కలెక్టర్



విశాలాంధ్ర-శ్రీకాకుళం: అభివృద్ధికి అవకాశం ఉన్న అన్ని రంగాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అధికారులంతా చిత్త శుద్ధితో పని చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కీలక శాఖల 100 రోజుల కార్యాచరణ నివేదికలపై శాఖల వారీ ఉన్నతాధికారులతో బుధవారం నుంచి సమీక్షలు నిర్వహించి దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో 100 రోజుల పనుల ప్రగతి, లక్ష్యాలపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తో కలసి జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి సిబ్బందితో మాట్లాడారు. జిల్లాలో ప్రగతిని వేగవంతం చేసేందుకు వంద రోజుల సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, ఆ నివేదికల ఆధారంగా పక్కా ప్రణాళికతో కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖపై మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా ఫ్రీ హెూల్డ్ భూముల రికార్డుల పరిశీలన కార్యక్రమం పూర్తి చేయాలని, పరిశీలన పూర్తయ్యాక లోటు పాట్లు ఏమైనా ఉంటే ప్రభుత్వ నిర్ణయం మేరకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉపాధి హామీ పనుల లేబర్ బడ్జెట్, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఈ పంట నమోదు, తదితర అంశాలలో నిర్దేశించిన ప్రగతి లక్ష్య సాధనలో కొంతమంది మండల క్షేత్ర స్థాయి అధికారులు తక్కువ ప్రగతి సాధిస్తున్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ సీఈవో ఆర్.వెంకట్ రామన్, సీపీవో ప్రసన్న లక్ష్మి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కే.శ్రీధర్, డిఎంహెచ్ఓ బి.మీనాక్షి, పలు శాఖల అధికారులు, అన్ని మండల తహశీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో నిధుల దోపిడి....!

అవినీతి అక్రమాలకు తెరలేపిన ఉద్యోగులు...

వీఓ ఎన్నికలు లేకుండా ఎంఎంఎస్. ఎన్నికలా..?

విశాలాంధ్ర-మందస: మండల వైఎస్ అర్ క్రాంతి పదం (వెలుగు) కార్యాలయంలో విచిత్రమైన కథలు నడుస్తున్నాయి. ఈ కార్యాలయంలో జరుగుతున్న అవకతవక విదానాలకు ఉద్యోగులు కీలక భూమిక పోషిస్తున్నారు. దీనికి సంబందించిన వివరాలలివి,, ఈ కార్యాలయంలో వివిధ కార్యక్రమాల కొరకు చేపడుతున్న ఖర్చులు ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా అధికంగా చేసినట్లు చూపిస్తూ నిధులను ఉద్యోగులు దోచేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహిళా సంఘాలకు సంబందించిన ఋణం మంజూరు లో క్రింది స్థాయి సిబ్బంది పెద్ద ఎత్తున చేతివాటం ప్రదర్శిస్తూన్నారని, అందులో వెలుగు కార్యాలయ మండల స్థాయి అధికారులు ఆదేశాల తోనే ఈ దోపిడీ అవుతుందని విమర్శలు వున్నాయి. ఇదిలా ఉంటే మండల స్థాయిలో మహిళా సమైక్య కు ప్రతీ ఏటా పాలక వర్గం ఎన్నికలు జరగాలి. అంతకు ముందు గ్రామఖ్య సంఘాలు ఎన్నికలు నిర్వహించాలి.గ్రామఖ్య సంఘాలలో ఎన్నికైన సభ్యులు మండల స్థాయిలో జరిగే మండల మహిళా సమైక్య కు పాలకవర్గం ఎన్నికకు సభ్యులు గా ఉంటారు. మండలంలో 56 గ్రామఖ్య సంఘాలు ఉండగా నిబంధనలకు విరుద్ధం గా అనేక చోట్ల గ్రామఖ్య సంఘాలకు ఎన్నికలు నిర్వహించ కుండా సంబంధిత సీఎఫ్, సిసి లు కలిసి తీర్మానాలు తయారు చేసి మండల సమైక్య కు సమర్పించి నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా కోరం కాకుండా గ్రామఖ్య సంఘాల ఎన్నికలు జరిగినట్లు మరికొన్న దగ్గర సీఎఫ్, సిసి లు కలిసి తీర్మానాలు తయారు చేసినట్లు ఆరోపణలు వున్నాయి. గ్రామఖ్య సంఘాలు నుంచి మండల మహిళా సమైక్య పాలకవర్గం వరకు తమ కనుసన్నల లో ఉండేలా ప్రణాళిక బద్దంగా ఉద్యోగులు కలిసి పన్నాగాం పన్నారని, అందులో భాగం గా ఈ నెల 18న మండల మహిళా సమైక్య పాలకవర్గం ఎన్నికలు సైతం ఎటువంటి ప్రచారం లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎ.పి.ఎం. పని తీరు పైన, గొప్యంగా నిర్వహిస్తున్న మండల మహిళా సమైక్య పాలకవర్గం ఎన్నికలపై కూటమి నాయకులు స్థానిక ఎం ఎల్ ఎ గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లేందుకు సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తుంది. దీనిపై అధికారులు దృష్టి సారించి దర్యాప్తు చేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

ఆదిత్యుని దర్శించుకున్న ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వీసీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ఆంధ్ర కేసరి యూనివర్సిటీ (ఒంగోలు) వైస్-ఛాన్సలర్ మరియు ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం సీనియర్ అధ్యాపకులు ఆచార్య డి.వి.ఆర్. మూర్తి మంగళవారం, అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వాదం అందుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఈ సందర్భంగా ఆదిత్యుని చిత్రపటం ఆచార్య డి.వి.ఆర్. మూర్తి కు అందజేశారు. అనంతరం, సూర్య నమస్కారాలు, సూర్య హెూమం పూజలలో ఆచార్య మూర్తి పాల్గొన్నారు. స్థానిక డా.బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అధ్యాపకులు డా. ఆర్.తిరుపతిరావు, డా. జి. ఎల్.వి. ప్రసాద రావు, డా. వై. డి. రామదాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విధ్యార్ధులకు తర్ఫీదిచ్చిన గణపతిరావుకు సన్మానం

విశాలాంధ్ర-నరసన్నపేట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పి.డి, కె.గణపతిరావుకు మంగళవారం పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, పైడి వెంకటరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సంధర్భంగా హెచ్.ఎం, వెంకటరావు మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పి.దివ్యధాత్రికి సాయిలో వాలీబాల్ శిక్షణకు ఎంపిక కావటం, అండర్-14. 19విభాగంలో 7మంది విధ్యార్ధులకు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ ఆటకు ఎంపిక కావటం, అంతేకాక రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు పాఠశాల విధ్యార్ధిని, కోల భవానికి ఎంపిక చేయటానిక తర్ఫీదును ఇచ్చి. పాఠశాలలో చదివే విధ్యార్ధులను క్రీడాకారులుగా తయారుచేయటమే కాకుండా, పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గణపతిరావు మంచిపేరు తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టి.రూపవతి, సాయి శ్రీనివాస్‌శర్మ, ఎం.వి.ఏ.జి.డి.కె.కుమార్, బి.రామారావు, బి.రాజేంద్రనాయుడు, యు.సాయిశంకర్, ఉమారాణి, భారతి, తులసీ, ఆనందరావు, రమేష్, మూర్తి, జలుమూరు, పోలాకి మండలాలకు చెందిన పిఈటిలు, పిడిలు, విధ్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

- వేదాల ప్రకారం ఈ సృష్టి కర్త విశ్వకర్మనే

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : విశ్వకర్మ పూజ అనేది హిందూ సమాజంలోని ప్రజలకు చాలా ముఖ్యమైనది. భగవంతుడు విశ్వకర్మ రచనలు రుగ్వేదం, స్థాపత్య వేదాలలో ప్రస్తావించబడ్డాయని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. విశ్వకర్మ జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పండుగగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన సందర్భంగా మంగళవారం ఉదయం కలెక్టరెట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ తో కలసి విశ్వకర్మ చిత్ర పఠానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హిందూ పురాణాల ప్రకరం రుగ్వేదంలో, క్రిష్ణ యజుర్వేదంలో సృష్టికర్తగా విశ్వకర్మను పరిగణిస్తారన్నారు. కార్యక్రమంలో శాసన సభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ విశ్వకర్మ పూజ అనేది హిందూ సమాజంలోని ప్రజలకు చాలా ముఖ్యమైనది. భగవంతుడు విశ్వకర్మ రచనలు రుగ్వేదం, స్థాపత్య వేదాలలో ప్రస్తావించబడ్డాయి. వాస్తు శాస్త్రం మరియు యాంత్రిక శాస్త్రం గురించి అనేక విషయాలున్నాయి. విశ్వకర్మ పూజ విజయవంతం కావాలని.. ఆ దేవుని ఆశీస్సులు లభించాలని.. కుటుంభాలు ఆయురారోగ్యాలతో అనునిత్యం ఆనందంగా ఉండాలన్నారు. పని చేసే వారితో పాటు హస్తకళాకారులు విశ్వకర్మ పూజలో భాగంగా తమ పనిముట్లను ఆరాదీస్తారాన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఇ. అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, జిల్లా విశ్వ బ్రాహ్మణ జిల్లా వెల్ఫేర్ సంఘం అధ్యక్షులు ధనుంజయ ఆచారి, గణపతి,వీరాస్వామి, హరినాథ్ తదితర కమ్యూనిటీ సభ్యులు, కలెక్టరేట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత సింగుపురం

విశాలాంధ్ర-పొందూరు: మండలకేంద్రానికి చెందిన కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రులు సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో విజేతగా సింగుపురం జట్టు నిలిచింది. సోమవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీలో కొర్లకోట జట్టుపై సింగుపురం జట్టు గెలిచి విజేతగా నిలిచింది. మొదటిస్థానంలో నిలిచిన జట్టుకు ట్రోపీతో పాటు రూ 15 వేలు నగదు. రన్నరప్ గా నిలిచిన కొర్లకోట జట్టుకు ట్రోపీతో పాటు రూ 10 వేలు నగదు, మూడవస్థానంలో నిలిచిన పొందూరు జట్టుకు ట్రోపీతో పాటు రూ 7 వేలు నగదు బహుమతి అందించారు. విజేతలకు ఎం పీటీసీ ఎ. వాణి, టీడీపీ పట్టణ అధ్యక్షులు అనకాపల్లి శ్రీ రంగ నాయకులు (చినరంగ,) యూత్ క్లబ్స్ అధ్యక్షులు కె. శాం తారాం బహుమతులు అందించారు.

ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 4వేల మందికి అన్నదానం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఎచ్చెర్ల, తోట పాలెం గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సూర శ్రీనివాసరావు 4వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనతో మానసిక శక్తి సిద్ధించడంతో పాటు సేవా దృక్పథం అలబడుతుందన్నారు. వినాయక చవితి నవరాత్రులు ప్రతి ఒక్కరూ భక్తులతో జరుపుకుంటూ లోక రక్షణ కోసం పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఆ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని కోరుకున్నారు. గ్రామాల్లోని యువత కలిసికట్టుగా ఉంటూ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానం చేయడం ద్వారా ఆకలి తీర్చుకున్న భక్తులు ఎంతో సంతృప్తి చెందుతారని తెలిపారు. అందుకే గత కొన్నేళ్లుగా ఎచ్చెర్ల, శ్రీకాకుళం నగరంలోని అనేక ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం తనకు ఆనవాయితీగా వస్తుందని చెప్పారు.

ఆలయాల్లో పూజలు,రక్తదాన శిబిరాలు

బీజేపీ నేత సిరిపురం సారథ్యంలో పీఎం మోడీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కొత్తూరు : పాత పట్నం బీజేపీ నేత విద్యావేత్త సిరుపురం తేజేశ్వర రావు ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సమస్థ సహకారం తో. ప్రధాని మోడీ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు, అనంతరం ఉమామహేశ్వర ఆలయంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పేరున అర్చన, అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం పాల్గొన్నారు. పాతపట్నం మండల కేంద్రంలో భారత ప్రధాని నరేంద్ర దామోదర్ దాస్ మోడీ జన్మదిన వేడుకలనువైభవంగా పాతపట్నం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. భారత ప్రధాని నరేంద్ర మోడీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్‌ను కట్ చేసి ఐదు మండలాల బిజెపి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం కోసం ధర్మం కోసం అలుపెరగని నాయకుడు విశ్వ గురువుగా పిలవబడే నరేంద్ర మోడీ పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీలో విశేషంగా ప్రజలు సభ్యత్వం తీసుకోవాలని సిరిపురం కోరారు, అనంతరం పాతపట్నం మండల కేంద్రంలో ఆసుపత్రిలో రోగులకు మోడీ జన్మదిన సందర్భంగా పండ్లను పంచారు. ఆసుపత్రి ఆవరణంలో మోడీ పేరున మొక్కలను నాటారు. ఉత్కలాంధ్ర ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గమ్మ వారు ఆలయంలో నరేంద్ర మోడీ పేరుపైన అర్చన చేయించి ప్రత్యేక పూజలు సిరిపురం చేయించారు. హిరమండలం మండలంలో సత్యసాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు మోడీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లను పంచారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు తాడేలా భూపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు వి ప్రసాదరావు, కొత్తూరు మండల అధ్యక్షులు సిహెచ్ నరసింహమూర్తి, బూరాడ భాస్కరరావు, బడియాల బాబురావు, ఆసూరి ఉమామహేశ్వరరావు, హిరమండలం మండల అధ్యక్షులు ధర్మారావు, రవి వర్మ, సూర్యనారాయణ, పడాల షణ్ముఖరావు, ఐదు మండలాల బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

95 శాతం విద్యార్థులు డివార్మింగ్ మాత్రలు

విశాలాంధ్ర-పొందూరు : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలు తాడివలస పీ హెచ్ సి పరిధిలో ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో 95 శాతం మంది విద్యా ర్థులకు డివార్మింగ్ మాత్రలు వేసినట్లు పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ రమేష్ నాయుడు తెలిపారు. పీహెచ్సీ పరిధిలో 43 పాఠశాలల్లో 4949 మంది విద్యార్థులకుగాను 4702 మంది విద్యార్థులకు డివార్మింగ్ మాత్రలు వేసామన్నారు. కళాశాలలు, ఐటీఐలు కలిసి 7299 మందికిగాను సుమారు 95 శాతంతో 6911మందికి డివార్మింగ్ మాత్రలు వేస్తారు.

పర్యావరణ పరిరక్షణ పెంపొందించేందుకు కృషి చేద్దాం

సెంచురియన్ యూనివర్సిటీ వ్యవసాయ పట్టభధ్ర విద్యార్థినులు

విశాలాంధ్ర-మెలియాపుట్టి: పర్యావరణ పరిరక్షణ పెంపొందించే దశగా ప్రతి ఒక్కరం కృషి చేద్దామని సెంచూరియన్ యూనివర్సిటీ వ్యవసాయ పట్టభద్ర విద్యార్థినులు ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. మెలియాపుట్టి మండలం, చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం వారు పర్యావరణ పరిరక్షణ అంశంపై విద్యార్థులకు అనేక అంశాలపై అవగాహన కల్పిస్తూనే నేడు రోజురోజుకి వాతావరణం లోని ఉష్ణోగ్రతలు పెరగడానికి మొక్కలు తరిగిపోతుండటమే కారణమని, ఉష్ణోగ్రతను తగ్గించడానికి మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కారమని, పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణ, గ్లోబల్ వార్మింగ్ నివారణకు మొక్కలు తోడ్పడతాయిని, ఆ దశగా ప్రతి ఒక్కరు కృషి చేయడంతో పాటు మొక్కలు నాటించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేటి విద్యార్థులు, యువత తలుచుకుంటే దేన్నైనా సాధించగలమని తెలియజేస్తూనే ఇప్పుడు మొక్కలు పెంచడం వల్ల వాతావరణ సమతుల్యం పాటించడంతోపాటు భవిష్యత్ తరాల వారికి మేలు చేసే వారమవుతామన్నారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వ్యవసాయశాఖ పట్టభద్ర విద్యార్థినిలు సత్యశ్రీ, నవ్య, సంజన, రోహితలతో పాటు ప్రధానోపాధ్యాయులు ఎ. గణపతిరావు, పిడి కె. మురలీమోహన్, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు తదితరులున్నారు.

విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని ఎచ్చెర్ల, పొన్నాడ పీహెచ్సీల పరిధిలోని పాఠశాలలకు నులి పురుగుల మందులను పంపిణీ చేశారు. దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలురు గురుకుల పాఠశాల/ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, పొన్నాడ పీహెచ్సీ విస్తరణాధికారి జి. జగన్నాధరావు, ఏఎన్ఎం జి.కమల ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను వేశారు.

స్వచ్ఛతా హి సేవ'కు కిష్టప్పపేట గ్రామపంచాయతీ సన్నద్ధం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: కిష్టప్పపేట గ్రామపంచాయతీ లో ఇంచార్జి సర్పంచ్ అరసవిల్లి సత్యవతి, మాజీ సర్పంచ్ గొండు స్వాతి శంకర్ మాట్లాడుతూ మారథాన్లు, సైక్లోథాన్‌లు, మానవహారాలు, మొక్కల పెంపకంతో పాటు గ్రామం సుందరీకరణ పనులు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువతీ యువకులు, స్వచ్ఛంద సంస్థలు, సీనియర్ సిటిజన్స్, వ్యాపార సంస్థలు, భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

- ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వశ్చతా హి సేవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని నైర సర్పంచ్ అరవల రాం ప్రతాప్ పిలుపునిచ్చారు. మంగళవారం నైర పంచాయతీలో విద్యార్థులు, మహిళలతో ర్యాలీ నిర్వహించారు.

దుర్గాపూజకు పందిరి రాట

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం బైపల్లి గ్రామంలో దుర్గా నవరాత్రి సందర్భంగా మంగళవారం రోడ్డు పక్కన దుర్గ పూజ కోసం పందిరి రాట ముహూర్తం ధర్మారావు దంపతులచే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దసరా సందర్భంగా ప్రతి ఏడాది గ్రామస్తులు దుర్గ పూజ సంబరాలను ఘనంగా నిర్వహిస్తారు. దసరాకు ప్రవాసాంధ్రులు అధికంగా స్వగ్రామానికి చేరుకుని కుటుంబాలతో ఆనందంగా గడుపుతారు.

ప్రజల హృదయాలలో నిలిచే ప్రజానేత దాసరి

వర్ధంతి సభలో వక్తలు నివాళి

విశాలాంధ్ర-మందస: ప్రజల హృదయాలను గెలుచుకున్న ప్రజానేత దాసరి ఖగేశ్వరరావు అని వ్యక్తలు కొనియాడారు.మంగళవారం మందస యాదవ్ భవన్ లో మాజీ సర్పంచ్ దివంగత దాసరి ఖగేశ్వరరావు 7వ వర్ధంతిని పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పలువురు వ్యక్తలు మాట్లాడుతూ ఖగేశ్వరరావు మన మధ్య లేరన్న వార్త నేటికి బాధ కలిగిస్తుందన్నారు. కింజరాపు, గౌతు, కుటుంబ సభ్యుడుగా మెలిగారని, అలాగే దివంగత నేతలు మజ్జి శారద, జుత్తు జగన్నాయకులకు అండగా నిలబడ్డారని, మాజీ మంత్రి డా.సీదిరి కి గురువుగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆయన ఎప్పటికి ప్రజల మదిలో సజీవంగా నిలిచే ఉంటారని అన్నారు.. ఆయన లేని లోటు తీర్చలేనిదని వాపోయారు. ఆయన అనేక పదవులు నిర్వహించి పదవులకు గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ఆయన చేసుకున్న మంచి పనులే ఆయనకు శ్రీరామ రక్షగా నిలిచాయని, అందుకే ఆయన ఇద్దరు కుమారులు దాసరి దివాకర్, దాసరి శివ ప్రభుత్వ ఉద్యోగులు గా స్థిర పడ్డారన్నారు.ఈ కార్యక్రమం లో యాదవ సంఘం మందస మండల అధ్యక్షులు మద్దిల రామారావు, తెలుగుదేశం నాయకులు మాజీ ఎంపీపీ దాసరి తాతారావు,యాదవ సంఘం గౌరవ అధ్యక్షులు మట్ట ఆనందరావు, యువజన నాయకులు మామిడి సోమేష్ యాదవ్, సదాశివుని ప్రకాష్, పొందర దుదిష్టి పాత్రో,తదితరులు పార్టీలకతీతం గా ఆయన అభిమానులు, అనుచరులు పెద్ద ఎత్తున హాజరై నివాళులు అర్పించారు.

వినాయక కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధికార పార్టీ బీసీ సెల్ కన్వీనర్

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం అన్నుపురం పలు గ్రామాల్లో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను రాష్ట్ర అధికార పార్టీ బీసీ సెల్ కన్వీనర్ ధర్మాన తేజ్ కుమార్ మంగళవారం దర్శించి స్వామివారి ఆశీస్సులు అనుగ్రహం పొందారు. సుమారు 6, 7 గ్రామాల్లో పర్యటించి అక్కడ కమిటీ సభ్యులను కలుసుకొని యోగక్షేమాన్ని అడిగి ఏమైనా తనవంతు సహకారం కావాలంటే తెలియజేయాలని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆయనతోపాటు మండలానికి చెందిన పలువురు టిడిపి నేతలు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవ పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-మెలియాపుట్టి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంపై గ్రామాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు గ్రామాలలో పారిశుధ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని, పచ్చదనం పెంపుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని తదితర అంశాల పట్ల ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. దీనికి సంబంధించి మంగళవారం గ్రామాలలో ర్యాలీలు, మానవహారంగా ఏర్పడి ప్రజలకు స్వచ్ఛత హి సేవ పథకం యొక్క ముఖ్య ఉద్దేశాన్ని నినాదాలు రూపంలో తెలియజేస్తున్నారు. ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ నెల రెండవ తేదీ వరకు గ్రామాలలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నారు. మంగళవారం నాడు మెలియాపుట్టి మండల కేంద్రంతో పాటు కోసమాళ తదితర ప్రతి గ్రామ పంచాయితీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు కూటమి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో విశ్వకర్మ పూజలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : శ్రీ ఆదివిరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా మండల కేంద్రం సంతబొమ్మాళి బస్టాండ్ ఆవరణలో మంగళవారం, విశ్వకర్మపూజలు ప్రారంభం అయ్యాయి. సంతబొమ్మాళి మండలం విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, మూడురోజుల పాటు జరగనున్న ఈకార్యక్రమం లో మొదటిరోజు స్వామివారువిగ్రహం గ్రామ ప్రదక్షిణతో ప్రారంభమై, గణపతిపూజ, అఖండ దీపారాధన, పుణ్యహవచనం, రాక్షభందనం,మహా మండపారాధన కార్యక్రమాలు జరిగాయి. అలాగే రెండో రోజు బుధవారం హెూమంపూజలు జరుగుతాయని, చివరిరోజున కుంకుమ పూజలు, పూర్ణహుతి, హెూమం, అన్నసమారాధన కార్యక్రమం జరుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటరమణ, చలపాక జగ్గారావు, లక్కోజు జయరాం, గుంటముక్కల జోగారావ్, గన్నవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా ఎం.లోకనాదం

విశాలాంధ్ర-జలుమూరు : సారవకోట మండల ప్రత్యేక అధికారిగా పశుసంవర్ధక శాఖ కోటబొమ్మాళి ఏడి మందలోకనాధం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని ఆయన అన్నారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఎంపీడీవో రాంబాబు, సిబ్బంది పలువురు అభినందించారు. మండల పరిధిలో ఉన్న అనేక సమస్యలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పనితీరు గ్రామస్థాయి సిబ్బంది పనితీరును పరిశీలించి ప్రభుత్వ ఇచ్చిన బాధ్యతలను సమన్వయంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

సర్పంచ్ పూడి లక్ష్మణరావు

విశాలాంధ్ర-కవిటి : పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు మంగళ వారం మండల కేంద్రమైన కవిటి లో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం సర్పంచ్ పూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కవిటి గ్రామపంచాయతీ కార్యాలయం నుండి స్వచ్ఛత హి సేవ ర్యాలీ ప్రారంభించి, మూడు రోడ్లు జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు.అనంతరం కవిటి ఎస్ వి జె కళాశాల వద్ద చెత్తకుప్పలను తొలగించి సర్పంచ్ పూడి లక్ష్మణరావు చేతుల మీదుగా మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్య నారాయణ రెడ్డి,ఈఓపిఆర్డి శివాజీ పాణిగ్రాహి, ఏపీవో గోవింద్, ఈవో వీరభద్ర స్వామి, ఏపీవో టీ మోహన్ రావు,బి రమేష్, ఏ మధు, ఉప సర్పంచ్ ప్రతినిధి దూర్యోధన, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యమైన గ్రామాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-పొందూరు: గ్రామాలలో సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యవంతమైన గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో హరిహరరావు అన్నారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా పొందూరు పట్టణంలో సంపూర్ణ పారిశుధ్యం నిర్వహించి అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పారిశుద్యంపై నినాదాలు చేసారు. మార్కెట్లో దుకాణాల వద్దకు వెళ్ళి పారిశుద్యంపై అవగాహన కల్పిం చారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో మోహనబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఐకేపీ సిబ్బంది, హెల్తాసిబ్బంది పాల్గొన్నా రు. మండలంలోని అన్ని పంచాయతీలలో స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు.

గ్రామాల్లో స్వచ్ఛత హై సేవా ర్యాలీలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా గ్రామాల్లో స్వచ్ఛత హై సేవా ర్యాలీలు నిర్వహించారు. అరిణాం అక్కివలసలో నిర్వహించిన ర్యాలీలో సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి. విజయలక్ష్మి, కూటమి నేతలు గట్టెం శివరామ్, పి.శంకరరావు, జి.సత్యారావు. పి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అజ్జరాం గ్రామంలోని మండల ఎంపీపీ స్కూల్ ఆవరణలో మానవహారం చేయించి నినాదాలు చేయించారు కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది శ్రీధర్, రామరావు, ఆదినారాయణ ఉపాధ్యాయులు ఎస్ పి వి రమణ తదితరులు పాల్గొన్నారు

ఫోటో: మానవహారంగా ఏర్పడిన దృశ్యం: 17ఎస్‌కెఎల్ఎం36

డిజిపురం విద్యార్దులకు నులిపురుగుల మందులు పంపిణి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈమండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్ధు లకు, దండుగోపాలపురం ఆరోగ్య విస్తరణ అధికారి వి.నాగేశ్వరరావు బృందము విద్యార్థులకు, నులి పురుగులు మందులను పంపిణీ చేశారు. విద్యార్థులతో సమావేశమై నులి పురుగులు ఎలా ఏర్పడతాయి. వాటివలన కలుగుతున్న అనారోగ్య సమస్యలను వివరిస్తూ, వీటిని అరికట్టుటకు కేంద్రప్రభుత్వం జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవ కార్యమాన్ని చేపట్టారని తెలిపారు. 286 మంది విద్యార్థులతో మాత్రలను నమిలించి, మింగించారు. ఈకార్యమములో ప్రధానోపాధ్యాయులు, కోత చైతన్య, ఉపాధ్యాయులు తూటభాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, రోజ పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండండి

సీఐ అంబటి విజయ్ కుమార్

విశాలాంధ్ర-టెక్కలి : ఈ మధ్యకాలంలో అధిక సంఖ్యలో దొంగతనాలు జరుగుతున్నాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ అంబటి విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం పోలీస్ కార్యాలయంలో దేవాలయాలకు సంబంధించి పూజారులు, ట్రస్ట్ బోర్డ్ కమిటీ మెంబర్స్ తో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఇళ్లల్లో, దేవాలయాలలో తరచుగా దొంగతనాలు జరుగుతున్నాయని, దొంగతనాలు జరగకుండా ఉండేందుకు తగు సూచనలు తెలిపారు. ప్రతి దేవాలయాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పెట్టుకోవాలని, రాత్రి సమయంలో దేవాలయంలో ఉన్న వస్తువులను ఉంచకూడదని తెలిపారు. ఎవరైనా ఊరు నుండి తీర్థయాత్రలకు, వివిధ కార్యక్రమాలపై వెళ్లేటప్పుడు ముందుగా పోలీస్ వాళ్లకి తెలియజేయాలని, లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టం కెమెరా సంబంధించి రిక్వెస్ట్‌ను ముందుగా పంపించాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్, రష్ డ్రైవింగ్, నెంబర్లు ప్లేట్లు లేనటువంటి వాహనాలు పత్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.స్వచ్ఛతను కాపాడుదాం గ్రామ పరిసరాలను స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ కాపాడుకుందామని ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి అన్నారు స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో రాజారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా చిన్నారులతో ర్యాలీ తీసి ప్రతిజ్ఞ చేపించారు.

ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కొత్తూరు : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు కొత్తూరులో ఘనంగా జరిగాయి. పాతపట్నం నియోజక వర్గ బీజేపీ పార్టీ ఇంచార్జ్ సలాన శరత్‌కుమార్ ఆధ్వర్యంలో నాలుగు కూడలిలో టిడిపి,బిజెపి, జనసేన కూటమి నాయకులు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ సలాన శరత్ కుమార్ ఆహ్వానం మేరకు టీడీపీ నేత వైఎస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వరప్రసాద్ రావు టీడీపీ నేతలు మాతల గాంధీ.అగతముడి అరుణ్ కుమార్ ఏ.మాధవ్‌రావు ఎల్. తాతబాబు పి.కులశేఖర బీజేపీ నేతలు వలరౌతూ ప్రసాదరావు ,సి. హెచ్చి గోవిందరావు తదితరులు న్నారు. కాగా అంతకుముందు మహిళలతో మానవహారం నిర్వహించారు అలాగే పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు తులసీ వర ప్రసాద్ రావు గారు మాట్లాడుతూ శ్రీ నరేంద్ర మోడీ గారు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో దేశ సేవలో కొనసాగాలని కోరారు ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: శ్యాంపిస్టన్స్ పరిశ్రమ (అరిణాం అక్కివలస) లో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మురపాక నాగరాజు అనే కార్మికుడు మృతిచెందాడు. కార్మికులు ఒక రోజు వేతనం రూ.1.49.215ను విరాళంగా సేకరించి కార్మికుడు నాగరాజు తల్లిదండ్రులు శ్రీరామ లు, చిలకమ్మలకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వీ రమణ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మెండ శ్రీను, పి.శ్రీనుబాబు, ఎల్. నాగరాజు. జల్లు సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర ఫార్మసీకి నాక్ ఏ గ్రేడ్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఉత్తరాంధ్రలో అత్యుత్తమ విలువలు పాటించే కళాశాలగా గుర్తింపు పొందిన శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల (ఎచ్చెర్ల) నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) ఏ గ్రేడ్‌ను సాధించింది. ఈ మేరకు కళాశాలలో మంగళవారం సక్సెస్ మీట్ను నిర్వహించారు. ఫార్మసీ కళాశాలలో బోధన, పరిశోధన, ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్నందున నాక్ ఏ గ్రేడ్ లభించింది. ఇటీవల నాక్ బృందం సభ్యులు కళాశాలను సందర్శించి కళాశాలలో మౌలిక సదుపాయాలు, సంస్థాగత పనితీరును పరిశీలించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ నాగోజీ, యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, డాక్టర్ బీవీఎస్ ఎన్ మూర్తి, ఇప్పిలి కిశోర్, డాక్టర్ బీఎస్ రాజా, బి. వంశీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ కౌశిక్‌కు పీజీ నీట్‌లో ఉత్తమ ర్యాంక్

విశాలాంధ్ర-సోంపేట: సోంపేటకు చెందిన సనపల కృష్ణకౌశిక్ పీజీ నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించాడు. ప్రముఖ న్యాయవాది దివంగత సనపల రామారావు కుమారుడైన కృష్ణ కౌశిక్ విజయనగరం ఎంఆర్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసి ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన మెడికల్ పీజీ నీట్ ఎంట్రన్స్‌లో ఆలిండియా ర్యాంక్ 9795 సాధించాడు. 95.50 మార్కులతో రాష్ట్ర ర్యాంకు 554 సాధించారు. ఓబిసి విభాగంలో ఇది ఆలిండియాస్థాయిలో 2800వ ర్యాంక్. తన తల్లి కవిత సహకారంతో కోచింగ్ లేకుండా ఇంటి వద్దనే చదువుకుని మంచి ర్యాంకు సాధించగలిగానని కౌశిక్ పేర్కొన్నాడు. కౌశిక్‌కు స్థానిక ప్రముఖులు, విద్యావంతులు అభినందిస్తున్నారు.

డీవార్మింగ్ మందులు పంపిణీ

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి: కంచిలి మండల కేంద్రంలో గల ఎంపీయుపీ పాఠశాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించే డీవార్మింగ్ (పొట్ట పురుగుల నివారణ) మందులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ పైల దేవదాసురెడ్డి ప్రారంభించారు.

జనసేన ఆధ్వర్యంలో మొక్కల పెంపకం

విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం తీర గ్రామమైన ఇసకల పాలెంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళశారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా భారీగా మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరి రాజు పాల్గొని పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జి.రాజు, భాస్కరరావు, బీన ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-టెక్కలి: వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్ అన్నారు. కోటబొమ్మాళి మండలం చిన్నబమ్మిడి గ్రామంలో రిలయన్స్ వారి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాధి సంక్రమిస్తే తీసుకోవలసిన నివారణ చర్యలను గురించి వివరించారు. ప్రతి పాడి రైతు ఉచిత పశు వైద్య శిబిరంలో వేస్తున్న టీకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రతినిధి చల్ల ఎర్రంనాయుడు, రీజనల్ కోఆర్డినేటర్ తిరుమల రావు భీమారావు వాండ్రాడ పశు సంవర్ధక సహాయకులు నరసింహులు, చిట్టివలస పశు సంవర్ధక సహాయకులు వెంకటేష్ గ్రామ ప్రజలు పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా టెక్కలి అభయం సేవా సంఘం

విశాలాంధ్ర-టెక్కలి: మండలం నర్సింగపల్లి గ్రామం ఉర్జాన గణపతి రావు కుటుంబ పోషణ నిమిత్తం విజయనగరంలో కూలీ పని చేసుకుంటూ జీవించేవాడు. ఇటీవల రోడ్డుపై వెళ్తుండగా వెనకనుండి లారీ ఢీకొనడం తో రెండు కాళ్లు విరిగిపోయి వైజాగ్ కేజీహెచ్ లో జ్వాయిన్ చేశారు. వీళ్లది నిరుపేద కుటుంబం కావడంచే గ్రామస్తులు తలో చేయి వేసి కొంత ఆర్థిక సాయం చేశారు. ప్రస్తుతం కేజీహెచ్ నుండి డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చేసారు. అయితే కొన్ని అత్యవసర ముందులు కొనడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం వాళ్ళు వెంటనే స్పందించి రూ.10వేలు క్షతగాత్రుని కుటుంబ సభ్యులకు అందించినట్లు అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ నిరుపేద కుటుంబం కి సాయం చేయడానికి పలువురు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, ట్రెజరర్ శ్రీనివాస బెహరా, సంఘ సభ్యులు ధర్మవరపు పూర్ణాచారి, గురుగుబెల్లి సూర్యనారాయణ, జలుమూరు శశిభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర-టెక్కలి: రావివలస పంచాయతీలో వివిధ గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి అనపాన జనార్ధన రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రావివలస కు ప్రత్యేక ఏర్పాటు చేయాలని అన్నారు. చిన్న నారాయణపురం, దామోదరపురం గ్రామాలలో ఇల్లు మీద వేలాడుతున్న ఎల్టిలైన్లు స్థానంలో కేబుల్ వైర్లు వెయ్యాలని తెలిపారు. రావివలసలో కొత్త విద్యుత్ స్తంభాలు వెయ్యాలని ఈ సందర్భంగా వారు కోరారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ క్రీడా సంబరాలు



విశాలాంధ్ర-టెక్కలి: టెక్కలి, నందిగాం మండలాల ఉపాధ్యాయులకు యుటిఎఫ్ స్వర్ణోత్సవ క్రీడా సంబరాలలో భాగంగా ఆదివారం, సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో అంగరంగ వైభవంగా క్రికెట్, క్యారమ్స్, బ్యాట్మెంటన్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు ఎల్ బాబురావు, జిల్లా సహా అధ్యక్షులు కూర్మాన దాలయ్య, మండల విద్యాశాఖ అధికారి తులసీరావు, డాక్టర్ బి లక్ష్మణరావు పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడలు వలన ఉపాధ్యాయులలో ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విజేతలకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సహా అధ్యక్షులు, చేతుల మీదగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి నారాయణరావు, ఎస్ లక్ష్మణరావు, వైవి రమణ, కే ప్రకాష్, ఎన్ రమేష్, జి శ్రీనివాసరావు, కే రఘునాథరావు, కేకే రెడ్డి, రెఫరీలుగా వ్యవహరించారు.

అమ్మ పేరున ఓ మొక్క నాటాలి: ఎంపీపీ ఉమా లక్ష్మి



విశాలాంధ్ర-తెర్లాం: మండల స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణ లో మంగళవారం ఎంపీపీ ఎస్ ఉమాలక్ష్మి, అమ్మ పేరున ఓ మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు. అనంతరం మానవహారం నిర్వహించి అమ్మ పేరున మొక్క ప్రాధాన్యతను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ రామకృష్ణ, ఏపీవో కే సుశీల, ఈవోపిఆర్ డి నీలిమ, ఎంఈఓ జె త్రినాధరావు, పాపారావు ఉపాధి హామీ సిబ్బంది, మండల పరిషత్తు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగం కావాలి

- కోకాకోలా సంస్థ ప్రతినిధులను కోరిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలోని మత్స్యకార గ్రామాలు, మారుమూల పల్లెల సమగ్ర అభివృద్ధి, యువతకు అండగా నిలిచేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ నిధులను కేటాయించి, వాటిని సద్వినియోగం చేయాలని కోకాకోలా సంస్థ ప్రతినిధులకు సూచించారు. కోకాకోలా సంస్థ సమాచార, ప్రజా సంబంధాల విభాగం ప్రధాన అధికారి హిమాన్షు ప్రియదర్శి, ఇతర ప్రతినిధులతో నగరంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం భేటీ జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని మత్స్యకార గ్రామాల్లో వీధి దీపాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించే విధంగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయడంపై కేంద్ర మంత్రి పలు సూచనలు చేశారు. అలాగే యువతకు నైపుణ్య శిక్షణ అందించి.. వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేయాలని కోరారు.

క్రీడలకు ప్రాధాన్యం... జిల్లా నుంచి ఏటా వేలాది మంది యువకులు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఉద్యోగ ఎంపికలకు సాధన చేస్తున్న నేపథ్యంలో.. షార్ట్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలకు కూడా శిక్షణ అందించాలని కోకాకోలా ప్రతినిధులను రామ్మోహన్ నాయుడు కోరారు. దీని వల్ల కేవలం కింది స్థాయి ఉద్యోగులకు మాత్రమే కాకుండా ఆఫీసర్ కేడర్ ఉద్యోగాలు కూడా సిక్కోలు యువత సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే క్రీడలకు నెలవైన శ్రీకాకుళం జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేలా మెగా టోర్నమెంట్ నిర్వహించాలని సూచించారు. క్రీడాకారులకు మరింత మెరుగైన శిక్షణ, సీనియర్ కోచ్ లను అందించేందుకు సంస్థ తరఫున సహకారం అందించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కోకాకోలా ప్రతినిధులు.. సమగ్ర ప్రణాళికతో ముందుకు వస్తామని వివరించారు.

ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకల నిర్వహించిన సిరిపురం

విశాలాంధ్ర-పాతపట్నం /హిరమండలం: జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ సమస్త ఆధ్వర్యంలో మోడీ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరంను సిరిపురం తేజేశ్వరరావు మంగళవారం ఏర్పాటు చేశారు. అనంతరం పాత పట్నంలోని ఉమామహేశ్వర ఆలయంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పేరున అర్చన, అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం పాల్గొన్నారు. పాతపట్నం మండల కేంద్రంలో భారత ప్రధాని నరేంద్ర దామోదర్ దాస్ మోడీ జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా పాతపట్నం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు కార్యాలయంలో నిర్వహించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ ను కట్ చేసి ఐదు మండలాల బిజెపి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం కోసం ధర్మం కోసం అలుపెరగని నాయకుడు విశ్వ గురువుగా పిలవబడే నరేంద్ర మోడీ పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీలో విశేషంగా ప్రజలు సభ్యత్వం తీసుకోవాలని సిరిపురం కోరారు. అనంతరం పాతపట్నం మండల కేంద్రంలో ఆసుపత్రిలో రోగులకు మోడీ జన్మదిన సందర్భంగా పండ్లను పంచారు. ఆసుపత్రి ఆవరణంలో మోడీ పేరున మొక్కలను నాటారు. హిరమండలం మండలంలో సత్యసాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు మోడీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లను పంచారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు తాడేలా భూపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు వి ప్రసాదరావు, కొత్తూరు మండల అధ్యక్షులు సిహెచ్ నరసింహమూర్తి, బూరాడ భాస్కరరావు, బడియాల బాబురావు, ఆసూరి ఉమామహేశ్వరరావు, హిరమండలం మండల అధ్యక్షులు ధర్మారావు, రవి వర్మ, సూర్యనారాయణ, పడాల షణ్ముఖరావు, ఐదు మండలాల బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగుచూసిన ఉపాధి అక్రమాలు

- నెల్లిపర్తి ఎఫ్ఏ గైర్హాజర్ - సైలాడ అదే స్థితి

సర్పంచ్ లేకుండా నెల్లిపర్తి గ్రామసభ

విశాలాంధ్ర-ఆమదాలవలస: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వా రా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించేందు కు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అందు లో భాగంగానే ప్రభుత్వం అందించిన నిధులు పారదర్శకంగా ఉన్నది లేనిది పరిశీలించేందుకు సోషల్ ఆడిట్ బృందా న్ని ప్రతి ఏటా నియమించారు. మంగ ళవారం సామాజిక తనిఖీల్లో భాగంగా కత్యాచార్యుల పేట, తొగరాం, దూసి, ఎన్ టి వాడ, నెల్లిపర్తి, సైలాడ, తురక పేట, తోటాడ గ్రామాల్లో తనిఖీలు నిర్వ హించారు. ఉపాధి పనుల్లో అధికారులు చేతివాటం కారణంగా పలు అక్రమాలు బయటపడ్డాయి. ఇందుకు బాధ్యులుగా ఫీల్డ్ అసిస్టెంట్లను చేస్తూ గ్రామ సభలో తీర్మానం చేశాయి. నెల్లిపర్తి గ్రామంలో గ్రామ సభకు ఫీల్డ్ అసిస్టెంట్ గైర్హాజర య్యారు. సుమారు మూడు లక్షల వరకు బినామీ పేర్లకు మస్టర్లు వేశారని, తన కుటుంబ సభ్యుల పేర్లు అన్ని పనులు వద్ద వేస్తూ వేతనం పొందారని, 2018లో సుంకర కృష్ణ అనారోగ్య కారణంగా మృ తి చెందారు, బంగు కృష్ణ 2021 లో మృతి చెందినప్పటికీ వారి ఇరువురి పేరున మస్టర్లు వేసినట్లు ఆడిట్ అధి కారులు గుర్తించారు. ఇలా గ్రామంలో 2023- 24 ఆర్థిక సంవత్సరం కాను జరిగిన అక్రమాలు బయటపడతాయి అన్న ఉద్దేశంతో సభకు గైర్హాజరయ్యారని ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తుంది. అలాగే సైలాడి గ్రామంలో కూడా ఇదే దుస్థితి నెలకొంది. గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ కనుక ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అధికారుల ముందు హాజర య్యా రు. అప్పటికి వచ్చిన ఫిర్యాదుల మేరకు సైలాడ ఫీల్డ్ అసిస్టెంట్ 1,35,000 వరకు అక్రమ మార్గంలో తరలించారని వేతన దారులు వెల్లడించారు. నాలుగు రోజు లుగా ఆడిట్ బృందం గ్రామాల్లో కలియ తిరుగుతూ వేతనదారులను కలిసి వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. ఆ విషయాలను సర్పంచ్ అధ్యక్షతన జరి గిన గ్రామ సభల్లో వెల్లడించారు. ఈ నేప థ్యంలోనే నిల్లిపర్తి గ్రామ సభకు సర్పంచ్, ఎంపిటీసీ, ఫీల్డ్ అసిస్టెంట్ లు గైడ్ హాజ రు కావడంపై స్థానికులు వారి అక్రమాల పైన అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. కత్యాచార్యుల పేటలో 57 పను లకు గాను 63 లక్షల 31392 ఖర్చు చేసి నట్లు వివరించారు అన్ని గ్రామాల్లోనూ డిజిటల్ ప్రజెంట్ల ద్వారా పనికిరాని వారి కి మస్టర్లు అందించారని ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది హాజరు కాకపో యినప్పటికీ వారి పేరున మస్టర్ అందిం చి వారి ఖాతాలో ఆ మొత్తాన్ని జమ చే సినట్లు వివరించారు. తురక పేట డిఆర్పి రామకృష్ణ పత్రికల్లో తప్పుడు రాతలు రాస్తున్నారంటూ సమాచారాన్ని అందిం చేందుకు నిరాకరించారు. నెల్లిపర్తి లో 38 పనులకు గాను 67 లక్షల 30400 ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సైలాడలో 47 పనులకు గాను 54,92,991 రూపాయిలు వెచ్చించినట్లు వివరించారు. తోటాడ, సైలాడ, రామచం ద్రపురం, కే మునగ వలస, గాజుల కొల్లివలస, వెదుళ్లవలస, నెల్లిపర్తి, ఎన్ టి వాడ, జీకే వలస, కలివరం, వంజంగి, తదితర గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పనితీరుపై ఇప్పటికే ఉన్నతాధికారులకు వేతనదారులు ఫిర్యాదులు అందించారు. జాబు కార్డు అడిగిన వారికి ఇవ్వకుండా ఒక వర్గానికే ప్రాధాన్యతనిస్తూ వేతన దారులను సమాన ప్రాతిపదికన చూడటం లేదన్న ఉద్దేశంతో నేతల వద్ద గ్రామస్థాయి వేత నదారులు మొరపెట్టుకున్నారు. దీంతో వీరిపై అటు అధికారులు ఇటు పాలకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ మండల సాయి సామాజిక తనిఖీల్లో వీరి పరిస్థితి వెల్లడి కానుంది.

రాజకీయ స్థిత ప్రజ్ఞుడు ఏచూరి

సీపీఎం నేత రెడ్డి శంకరరావు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ + నమ్మి న సిద్ధాంతం కోసం చివరివరకూ స్థిత ప్రజ్ఞత తో నిలబడ్డ నిజమైన రాజకీయ నాయకుడు సీతారాం ఏచూరి అని ఆయన విడిచివెళ్ళిన వారసత్వాన్ని కొనసాగించడమే మనం ఆయన కి ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం నగరకార్యాధర్శి రెడ్డి శంకరరావు అన్నారు. సీతారాం ఏచూరీ మరణం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు,శ్రామిక వర్గానికి తీరనిలోటని రెడ్డి శంకరరావు వ్యాఖ్యానించారు. గురజాడ నగర్ లో సీపీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించి నివాళి అర్పించారు. ముందుగా రెడ్డి శంకరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రజలకి అండగా నిలబడ్డారని ఆయన ఎంపిగా పార్లమెంటులో ఆనేక ఉపన్యాసాలు చేశారని. కార్మిక చట్టాలను మార్పుకి వ్యతిరేఖంగా పార్లమెంట్ లో తన ఘలం తెలియజేశారన్నారు. ఎంతోమంది వామపక్ష,ప్రజాతంత్ర నాయుకులను తయారు చేసారని, ఇతర దేశాల వామపక్ష నాయుకులు ఏచూరి సలహాలు తీసుకునేవారని తెలిపారు. పార్లమెంటులో ఆయన చేసిన ఒక్కో ప్రసంగం ఒక్కో వ్యాసమని ఇంతటి గొప్ప వారు మన మధ్య నుండి దూరం కావడం అత్యంత బాధాకరమన్నారు. సీతారాం ఏచూరి నుండి ఎంతో నేర్చుకోవాలని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలు కోసం, సమసమాజం కోసం కృషి చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి . రమణమ్మ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోసీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ , గరజాడ నగర్ కార్యదర్శి రంభ శ్రీను, శ్రీను, తది తరులు పాల్గొన్నారు..

స్వచ్ఛతను కాపాడుదాం

విశాలాంధ్ర-నందిగాం: గామ పరిసరాలను స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ కాపాడుకుందామని ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి అన్నారు స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో రాజారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా చిన్నారులతో ర్యాలీ తీసి ప్రతిజ్ఞ చేపించారు.

మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-నందిగాం: స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం వద్ద మంగళవారం వైద్యురాలు అనిత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి పాల్గొని స్వచ్ఛ సేవా దూతలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పంచాయితీలలో స్వచ్ఛ హీ సేవ కార్యక్రమం



విశాలాంధ్ర-కవిటి: మండలంలో గల శిలగం గ్రామ పంచాయతీలో ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ ఆధ్వర్యంలో సచ్ఛత హి సేవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు సచ్ఛత హి సేవ కార్యక్రమం పై అవగాహన కలిగించారు.ఈ సందర్భంగా ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, ప్రాముఖ్యత పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. శుక్రవారం డ్రై డే నిర్వహిస్తూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. గ్రామాలలో త్రాగునీటి సరఫరా నాణ్యతను పరిశీలించాలని, పారిశుధ్యం పై ఇంటింటా ప్రచారం నిర్వహించాలని అన్నారు. రోడ్లపై వేసిన చెత్త తొలగింపు,అవసరమైన కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. తడి చెత్త పొడి చెత్త పై అవగాహన కార్యక్రమాలు, గ్రామ శివారులో చెత్త పేరుకుపోయిన ప్రదేశాలను శుభ్రం చేయడం, ప్లాస్టిక్ వాడకం పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మన్మథ రావు,కృష్ణ రౌలో, కడియాల నితీష్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

విశాలాంధ్ర -ఇచ్ఛాపురం: ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించు కోవడం ద్వారా ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. మంగళవారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ తా హీ సేవ కార్యక్రమాన్ని సురంగి రాజా మైదానంలో కమీషనర్ ఎన్. రమేష్ ఆధ్వర్యంలో చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పొరిడా, 9వ వార్డ్ కౌన్సిలర్ బచ్చు జగన్ , మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది,మెప్మా సిబ్బంది, మార్నింగ్ వాకర్లతో కలసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. మైదానంలో చెత్తలను తొలగించి, అక్కడ చెత్తలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అయోధ్యపురం సమస్యలను తీర్చండి అంటూ మంత్రికి వినతి

విశాలాంధ్ర-టెక్కలి: రాష్ట్ర వ్యవసాయ పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ను టెక్కలి మండలం అయోధ్య పురం పంచాయతీ మాజీ సర్పంచ్ గున్న వెంకటరమణ, తెలుగు యువత కమిటీ ప్రెసిడెంట్ కొప్పల నగేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ కార్యాలయంలో ఆయనతో అయోధ్యపురం పంచాయతీలో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రాన్ని అందజేస్తూ వివరించారు. మంత్రి అచ్చన్న సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వేణు, భాస్కరరావు, చెల్లయ్య తదితరులు ఉన్నారు.

క్లూస్ టీం తో విచారణ

చోరీ జరిగిన ఆలయం

విశాలాంధ్ర-పొందూరు: ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు పెరుగుతున్న తరుణంలోని, ఆలయాలలో దొంగ తనాలు పెరిగిపోతున్నాయి. భక్తులు సమర్పించిన వెండి, బంగారు కానుకలు, హుండీలు ఎత్తికెళు తున్నారు. మండలం నందివాడ ఆశ్రమంలోని ఆలయంలోను చోరీ జరిగింది. భక్తులు భక్తితో ఆలయానికి సమర్పించిన వెండి, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. సుమారు 8 కేజీల వెండి ఆభరణా లు రెండు తులాలకు పైగా బంగారు ఆభరణాలు మాయమ్యాయి. ఆలయంలో ఉన్న హుండీలో భక్తులు భారీగా నగదు రూపంలో కానుకలు సమర్పించారు. హుండీలోను లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని బాలయోగి ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు.

- క్లూస్టంతో విచారణ...

ఆశ్రమంలోని ఆలయంలో చోరీపై ఆశ్రమ నిర్వాహ కులు పొందూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. ఎస్సై వి. సత్యనారాయణ సిబ్బందితో వెళ్ళి దర్యాప్తు ప్రారంభించారు. పెద్ద మొత్తంలో చోరీ జరగడంతో క్లూస్ టీంకు సమాచారం అందించారు. క్లూస్ టీం ఆశ్రమానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆశ్రమంలో తలుపులు, ఇతర వస్తువులపై ఉన్న వేలిముద్రలను క్లూస్టం పరిశీలించింది.

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంపై అవగాహన

విశాలాంధ్ర-గరివిడి: స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం ఉదయం ప్రముఖ మోటివేటర్ రేవంత్ కనకమ్,విశాఖపట్నం వారిచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంపై అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా రేవంత్ కనకమ్‌మాట్లాడుతూ విద్యార్థులు తమ మానసిక ప్రవర్తన,పాజిటివ్ అటిట్యూడ్,సెల్ఫ్ కాన్ఫిడెన్స్,నాయకత్వ లక్షణాలు వంటి అంశాలు విజయానికి కావలసిన సోపానాలని తెలియజేశారు.అలాగే కష్టంగా భావిస్తే ఏదీ సాధించలేమని ఇష్టంగా ముందుకు సాగితే ఏది అసాధ్యం కాదని తెలిపారు.విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు,ఆకాంక్షలు నెరవేర్చే విధంగా కృషి చేయాలని అన్నారు.అలాగే ఉద్యోగ నియమకాలుకు సంబంధించి మౌలిక పరీక్షలు,గ్రూప్ డిస్కషన్స్‌ల్లో విజయం సాధించడానికి తగు సూచనలు, సలహాలను విద్యార్థులకు లఘు చిత్రాల ద్వారా చూపించారు.వ రాబోయే రోజుల్లో మరెన్నో మోటివేషన్ తరగతులు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్ కుమార్,వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాతశాతం ఈపంట నమోదుకు కృషి చేయండి

విశాలాంధ్ర-జామి: ఈపంట నమోదులో శతశాతం లక్ష్యాన్ని సాదించేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామా రావు తెలిపారు. మంగళవారం మండలంలో జరుగుతున్న ఈపంట నమోదు ప్రక్రియను అకస్మికంగా తనిఖీ చేసారు. జామిలోని రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న ఈపంట నమోదును ఆయన స్వయంగా పరిశీలన చేసారు. ఈపంట నమోదుకు రైతులు ముందుకు రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు ఈపంట నమోదు, ఈకెవైసీ లక్ష్యం 85శాతం దాటిందని, నమోదకు ఈనెల 23 వరకు గడువు ప్రభుత్వం పొడిగించడంతో శాతశాతం నమోదుకు కృషి చేయాలని సూచించారు. ఈపంట వలన కలిగే లాభాలను రైతులకు పూర్తి స్థాయిలో వివరించాలని తెలిపారు. ఈపంట నమోదుకు ఉన్న ఇబ్బందులను, యాప్ పనిచేస్తున్న విదానాన్ని ఆయన తెలుసుకున్నారు. రైతులకు అందబాటులో వ్యవసాయ సహాయకులు ఉండాలన్నారు. అనంతరం మండలంలోని పంటలు, ఎరువులు తదితరఅంశాలపై ఏవో పి. కిరణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జలుమూరులో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

విశాలాంధ్ర -జలుమూరు: మండల కేంద్రంజలుమూరు కోన పెంటమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం జరిగింది దీనివలన జరిగే లాభాలు కోసం మండల ప్రత్యేక అధికారి జేఎస్ నాగలక్ష్మి జ్యోతి విద్యార్థులకు వివరించారు అనంతరం పలువురు విద్యార్థిని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఎంపీడీవో పి ఉమామహేశ్వరరావు ప్రిన్సిపల్ సిహెచ్ పద్మావతి ఎస్ చిన్న రాజులు వైద్య సిబ్బంది కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యం ప్రధానం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : భావి తరాల ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉండాలని జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శి, సీఈవో జోహార్ ఖాన్ అన్నారు. మంగళవారం పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవ కార్యక్రమాన్ని చేపట్టి, వైద్య, ఆరోగ్య సిబ్బంది ద్వారా పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండోస్ మాత్రలను వేశారు. పాఠశాలలో విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఈ మాత్రలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని జోహార్ ఖాన్ ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలనా అధికారిణి సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీం ఖాన్, పీ.ఈ.టి కైలాస్ పండా పాల్గొన్నారు.

స్వచ్ఛత హి సేవలో భాగస్వామ్యం కావాలి



విశాలాంధ్ర-భోగాపురం: స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎంపిడిఓ ఎన్. అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రమైన భోగాపురంలో అలాగే, గూడెపు వలసలో మంగళవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ, మానవహారం కార్యక్రమాన్ని ముందుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శ్రమదానముతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 15 రోజులు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమము విజయవంతం చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ ఉడికల అప్పయ్యమ్మ ఈఓఆర్డి ఐ. సురేష్ తదితరులు పాల్గొన్నారు.